నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 23 ఫిబ్రవరి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

బీడుగా మారిన కోడేరు మండలంలోని జొన్నలబొగుడరి జర్వాయర్‌ప రిధిలోని పొలాలు

కళ తప్పిన జొన్నలబొగుడ

కోడేరు, ఫిబ్రవరి 22 : సరైన వర్షాలు లేక కృష్ణా నదిలో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోయింది. సాగు నీటి ప్రాజెక్టుల కింద యాసంగి పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఎంజీకేఎల్ఐ రెండో లిఫ్టు జొన్నల బొగుడ రిజర్వాయర్‌లో నీరు అడుగంటింది. సాగుకు నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. రిజర్వాయర్ సామర్థ్యం 2.14 టీఎంసీలు ఉండగా నేడు 0.5 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నట్లు ఎంజీకేఎల్ఐ ఈఈ సంజీవరావు తెలిపారు. గతేడాది పసుపుల, పాన్‌గల్ బ్రాంచి కెనాల్ ద్వారా కోడేరు , పాన్‌గల్ మండలాల్లో 34 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, జొన్నలబొగుడ రెండో తూం ద్వారా పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగుడ నుంచి కల్వకోలు వరకు 12 వేల ఎకరాలు కలిపి మొత్తం 46 వేల ఎకరాలకు సాగునీరు అందేలా కాల్వలను ఏర్పాటు చేశారు. అయితే ఈసారి రిజర్వాయర్‌లో నీళ్లు తగ్గిపోవడంతో కాల్వలు పారడం లేదు. పంటలు ఎండే పరిస్థితి దాపురించింది. కోడేరు మండలంలో ఈ యాసంగిలో 12వేల ఎకరాల్లో వరి సాగు చేయగా ఈసారి యాసంగిలో కేవలం 5వేల వరకు పంటలు సాగు చేసినట్లు అధికారుల అంచనా..

కాల్వలు వెలవెల

సంజాపూర్ వద్ద ఎండిపోయిన కాల్వ

కల్వకుర్తి, ఫిబ్రవరి 22 : మార్చి ఆఖరు వరకు, అవసరమైతే ఏప్రిల్ నెల వరకు సాగునీటి కాల్వలు కృష్ణా నీటితో కళకళలాడేవి. ఇప్పుడేమో డిసెంబర్ లోనే కాల్వలకు నీళ్లు ఆగిపోయాయి. 2017నవంబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు (ఏప్రిల్ ఆఖరు రోజులు, మే, జూన్ మొదటి వారం మినహా..) కాల్వలు సాగుజలాలతో కళకళలాడేవి. ప్రభుత్వం మారింది.. సాగునీరు మాయమైందని రైతులు అంటున్నారు. ఎంజీకేఎల్ఐ 29వ ప్యాకేజీ ప్రధాన కాల్వ ద్వారా కల్వకుర్తి నియోజకవర్గానికి ప్రత్యక్ష్యంగా పరోక్షంగా దాదాపు 37వేల ఎకరాలకు సాగునీరు అందుతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రెండు నెలలు మినహా సంవత్సరం పొడవునా.. కాల్వలో నీళ్లు పారేవి. 2023 డిసెంబర్ నుంచి కాల్వలకు నీళ్లు బంద్ అయ్యాయి. సాగునీరు లేకపోవడంతో బోర్ల కింద మాత్రమే కొంత యాసంగి పంటలను సాగుచేశారు. భూగర్భ జాలలు కూడా క్రమక్రమంగా అడుగంటుతున్నాయి. సాగునీరు సమృద్ధిగా లేకపోవడంతో యాసంగి పంటలు సాగుచేయలేని రైతులు వర్షాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చింది.

5 వేల నుంచి 300 ఎకరాలకు..

కొల్లాపూర్, ఫిబ్రవరి 22 : ఎంజీకేఎల్ఐలో భాగంగా కొల్లాపూర్ మండలంలో నిర్మించిన సింగవట్నం శ్రీవారిసముద్రం రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.55 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఈ రిజర్వాయర్ కింద గత తొమ్మిదేండ్లల్లో యాసంగిలో మూడొందల ఎకరాలలోపే రైతులు వరి సాగు చేయడం ఇదే మొదటిసారి. ఈ ఏడాది వానకాలంలోనూ నిర్దేశించిన ఆయకట్టు మొత్తం ఐదు వేల ఎకరాల్లో 8 గ్రామాల రైతులు వరి పంట సాగుతో లబ్ధిపొందుతూ వచ్చారు. గత తొమ్మిదేండ్లుగా రెండు పంటలను సాగు చేసి ధాన్యపు రాశులను రైతులు పండించారు. ఈ రిజర్వాయర్ కింద ప్రస్తుతం యాసంగిలో ఐదువేల ఎకరాల నుంచి మూడొందల ఎకరాలకు వరి సాగు పడిపోయింది. ఈ మూడొందల ఎకరాలు సాగు చేసింది ఒక సింగవట్నం గ్రామ రైతులే. మిగతా ఏడు గ్రామాల రైతులు రిజర్వాయర్‌లో నీటి లభ్యతకు కష్టతరం కానున్నదని భావించి పంటకు నీరందక ఎండిపోతే సాగు పెట్టుబడులంతా వృథా అవుతుందన్న భయంతో ఈ యాసంగిలో వరి సాగు చేయకుండా క్రాఫ్ హాలీడేను రైతులే ప్రకటించుకున్నారు. దీంతో జావాయిపల్లి, మాచినేనిపల్లి, ఎన్మన్‌బెట్ల, చౌటబట్ల, నర్సింహాపురం, నర్సింగరావుపల్లి, రామాపురం గ్రామాల శివారు మాగాణి పొలాలన్నీ బీళ్లుగా మారాయి. కేసీఆర్ ప్రభుత్వంలో పాలకుల ముందుచూపు కారణంగా ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టులోని రిజర్వాయర్లలో కృష్ణానది నీటిని సమయానుకూలంగా నింపగలిగారు. దీంతో రైతుకు ఎలాంటి అవాంతరాలు ఉత్పన్నం కాలేదు. కానీ కొత్త ప్రభుత్వం వచ్చాక తమకు సాగు నీటి కష్టాలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

ఎన్మన్‌బెట్ల శివారులో వరి కొయ్యలనుమే స్తున్న గేదెలు



ర్యాలంపాడ్ రిజర్వాయర్‌లో అడుగంటిన జలం

అడుగంటిన ర్యాలంపాడు

రిజర్వాయర్ @ 0.5 టీఎంసీలు
క్రాప్ హాలిడేతో రైతుల్లో ఆందోళన

తేడారుతోంది..!

- ఉమ్మడి జిల్లాలో కళావిహీనంగా ప్రాజెక్టులు
- ఆయకట్టుకు సాగునీరు అందించలేని దుస్థితి
- పారని కాల్వలు.. ఎండిపోతున్న పైర్లు
- ప్రశ్నార్థంగా యాసంగి సీజన్
- దిక్కుతోచని స్థితిలో కర్షకులు

కమీషన్లకు నాటి కాంగ్రెస్ నేతల కక్కుర్తి

ర్యాలంపాడు రిజర్వాయర్ నిర్మాణ సమయంలో గత కాంగ్రెస్ పాలకుల కమీషన్లకు కక్కుర్తి పడ్డారు. దీంతో రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసుకోలేని పరిస్థితి దాపురించింది. నిర్మాణ సమయంలో 4 టీఎంసీలకు డిజైన్ చేయగా.. పనులు పూర్తయ్యాక నీటిని నింపే సమయంలో కట్ట నిర్మాణానికి లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో ఇరిగేషన్ శాఖాధికారులు పూర్తి స్థాయిలో నీటిని స్టోరేజీ చేయడం లేదు. దీంతో ప్రతి ఏడాది వానకాలం, యాసంగి సీజన్లలో సుమారు 20 వేల ఎకరాల సాగును రైతులు పంట నష్టపోవాల్సి వస్తుంది. కట్టకు బుంగలు పడి నీళ్లు లీకవుతున్నా పట్టించుకోలేదు. దీంతో పక్కనే కృష్ణమ్మ పారుతున్నా పూర్తిస్థాయిలో నీటిని సద్వినియోగం చేసుకోలేకపోవడంతో నడిగడ్డ రైతులకు శాపంగా మారింది.

ప్రాజెక్టులు అడుగంటె.. పొలాలు బీళ్లుగా మారె..

గద్వాల, ఫిబ్రవరి 22 : ర్యాలంపాడు రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గడంతో కళ తప్పింది. రిజర్వాయర్‌లో నీటిమట్టం గణనీయంగా తగ్గింది. సామర్థ్యం 4 టీఎంసీలు ఉండగా.. గతేడాది వరకు 1.5 టీఎంసీలు నిల్వ ఉంచారు. కానీ ఈసారి రిజర్వాయర్‌లో అర టీఎంసీ నీళ్లు మాత్రమే ఉన్నాయి. గత వానకాలం సీజన్‌లో రిజర్వాయర్ కింద సుమారు లక్షా 36 వేల ఎకరాలకు సాగు నీరు అందింది. అదే ఏడాది యాసంగిలో 35 వేల ఎకరాలకు నీళ్లొచ్చాయి. కానీ ఈ యాసంగిలో పరిస్థితి దారుణంగా తయారైంది. రిజర్వాయర్ కింద పంటలకు నీరు ఇవ్వలేమని అధికారులు క్రాప్‌హాలిడే ప్రకటించారు. దీంతో రైతులు పంటల జోలికి వెళ్లలేదు. బోరుబావుల కింద తప్పా ఎక్కడా సాగు కనిపించడం లేదు. కనుచూపు మేర రిజర్వాయర్‌లో నీరు కనిపించడం లేదు. బండరాళ్లు తేలాయి. ప్రాజెక్టులు కళ తప్పగా.. కాల్వలు వెలవెలబోతున్నాయి. వేసవి సమీపిస్తుండడంతో పశువులకు నీరు దొరకని పరిస్థితి నెలకొన్నది. జూరాలకు తొలి సారిగా వరద వచ్చిన సమయంలోనే నీటిని పంపింగ్ చేసి రిజర్వాయర్లను నింపి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని రైతులు అంటున్నారు.

జూరాల బ్యాక్ వాటర్ ఆధారంగా..

పీజేపీ డ్యాం బ్యాక్ వాటర్ ఆధారంగా నెట్టెంపాడు లిఫ్ట్ నిర్మించారు. కృష్ణానది నుంచి కాల్వ ద్వారా జలాలను మళ్లించి ధరూర్ మండలం గుడ్డెందొడ్డి వరకు తరలించి పంప్‌హౌస్ నుంచి నీటిని పంపింగ్ చేస్తారు. అక్కడి నుంచి ర్యాలంపాడు రిజర్వాయర్‌కు నీరు చేరుతుంది. 4 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన రిజర్వాయర్‌లో నీటిని స్టోరేజీ చేసి అక్కడి నుంచి ఎత్తిపోస్తే ఐదు మినీ రిజర్వాయర్లకు నీరు చేరుతుంది. ఆ తర్వాత కెనాల్స్ ద్వారా పంటలకు పారిస్తారు. ఈ రెండింటి పరిధిలో దాదాపు 2 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తర్వాత కృష్ణా నీటిని ఎత్తిపోస్తూ కేసీఆర్ ప్రభుత్వం రెండు పంటలకు నీరు అందిస్తూ వచ్చింది. ఈ ప్రాంతం పసిడి పంటలతో కళకళలాడింది. దీంతో ఈ ప్రాంతానికి వరప్రదాయినిగా నెట్టెంపాడు ప్రాజెక్టు మారింది. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నీరు, పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాది వర్షాలు కురవకపోవడం.. కృష్ణానదికి పెద్ద ఎత్తున వరదలు రాకపోవడంతో ప్రాజెక్టులు అట్టడుగు నీటిమట్టానికి చేరాయి.

మోడుబారిన ఆయకట్టు

ర్యాలంపాడు రిజర్వాయర్‌కు ప్రధానంగా 1,36,000 ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఎడమ కాల్వ 104వ ప్యాకేజీ ద్వారా మార్లబీడు, అల్వాల్ పాడు, కొండాపూర్, నందిన్నె వరకు మొత్తం 25 వేల ఎకరాల ఆయకట్టు ఉన్నది. కుడి కాల్వ పరిధిలో 105, 106, 107 ప్యాకేజీల ద్వారా ర్యాలంపాడు, సద్దలోనిపల్లి, మల్లకల్, అయిజ, గట్టు, అరగిద్ద, చమన్‌ఖాన్‌దొడ్డి, టీటీదొడ్డి, చాగదోన, భూపురం వరకు 1,11,000 ఎకరాల ఆయకట్టు ఉన్నది. ప్రధానంగా తాటికుంట, నాగర్‌దొడ్డి, ముచ్చోనిపల్లి, చిన్నోనిపల్లి సబ్ రిజర్వాయర్లను కలిగి ఉన్నది. ప్రస్తుతం వీటి కింద ఆరుతడి పంటలు కూడా పండే పరిస్థితుల్లేవు. ఆయకట్టంతా మోడుబారి కనిపిస్తుంది.

నీళ్లు పారక బోసిపోయిన ర్యాంలపాడు కాల్వ

కేసీఆర్ ప్రభుత్వంలో పుష్కలంగా నీళ్లు

తెలంగాణ ఏర్పాటైన తర్వాత కేసీఆర్ ప్రభుత్వంలో సాగుజలాలు పుష్కలమయ్యాయి. ఢోకా లేకుండా రైతులు రెండు పంటలు పండించారు. దీనికి తోడు రైతుబంధు, మద్దతు ధరతో ప్రభుత్వమే పంట ఉత్పత్తులను కొనుగోలు చేసింది. భూసార పరీక్షలు, విత్తనాల పంపిణీతోపాటు రైతులకు ప్రోత్సాహకారాలు అందించింది. దీంతో తెలంగాణ ధాన్యాగారంగా అవతరించింది. కానీ నేడు ఎవుసం బోసిపోయింది.. ఆయకట్టు మోడుబారింది.. ఎడారిలో తువ్వ గడ్డిని పోలిన ఆకారంతో ఆయకట్టులు ఆగమ్యగోచరంగా మారాయి.

పంటను మేతకొదిలిన రైతులు

ధరూరు, ఫిబ్రవరి 22 : యాసంగిలో సాగు చేసిన వరి పంటలకు సాగునీరు లేక పోవడంతో పంటలన్నీ ఎండి పోతున్నాయి. ర్యాలంపాడు రిజర్వాయర్ కింద ఆయకట్టుకు సాగు నీరందించలేమని అధికారులు ముందస్తుగానే ప్రకటించారు. అయినా కొంత మంది రైతులు బోర్ల కింద వరి పంటలను సాగు చేశారు. వాటిలో రోజు రోజుకు నీటిమట్టం తగ్గిపోవడంతో వేసుకున్న పంటలు పండే పరిస్థితి లేకుండా పోయింది. ధరూర్ మండలంలోని చాలా గ్రామాల్లో బోర్ల నుంచి నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో చాలా చోట్ల రైతులు పంటలను గొర్రెలు, మేకలు, పశువులకు మేతకోసం వదిలేశారు. ఫిబ్రవరిలోనే సాగునీరుకు ఇంత ఇబ్బంది ఉంటే మే నాటికి కనీసం తాగునీరైనా అందుతుందా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ధరూరు శివారులో ఎండిన పంటను మేస్తున్న గొర్రెలు

జీతాలూ మహాప్రభో..!

- కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు అందని వేతనాలు
- రెండు నెలలుగా ఎదురుచూపులు
- కుటుంబాల పోషణకు కష్టాలు
- ఇచ్చిన హామీలు అమలు చేయాలి

కరీంనగర్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కలెక్టరేట్ : 'ఓడెక్కె దాకా ఓడ మల్లన్న.. ఓడ దిగినంక బోడి మల్లన్న' అన్నట్టుగా ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. శాసనసభా ఎన్నికలకు ముందు ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించిన ఆ పార్టీ, ఇప్పుడు అమలులో మాత్రం చోద్యం చూస్తున్నది. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచడంతోపాటు ప్రభుత్వోద్యోగులతో కలిపి ఏ నెలకు ఆనెల విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చినా.. తీరా గెలిచిన తర్వాత జీతాలు పెంచడం దేవుడెరుగు? ఉన్న జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. ఫలితంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురు చూడాల్సి వస్తున్నది.

నాడు ఆదుకున్న కేసీఆర్ సర్కారు

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ, ఆరేండ్లలోపు బాలలకు ఆటాపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యనందిస్తున్నారు అంగన్‌వాడీలు. అలాగే, ప్రభుత్వం నిర్వహించే పలు సర్వేలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు కూడా చేస్తుంటారు. అయినా నాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. వేతనాలు పెంచాలని అనేక ఆందోళనలు చేసినపుడల్లా కంటితుడుపుగా రూ.వందో రూ.200 లో పెంచేవారు. అవి ఏ మూలకూ సరిపోక ఇబ్బంది పడేవారు. కానీ, కేసీఆర్ సర్కారు వచ్చిన తర్వాత ఆ పరిస్థితి మారింది. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించే కీలకమైన సేవల్లో ఉన్న అంగన్‌వాడీలకు సముచిత స్థానం కల్పించింది. కేంద్రంతో నిమిత్తం లేకుండా ఈ చిరుద్యోగుల సంక్షేమాన్ని చూసుకున్నది. తెలంగాణ వచ్చినప్పుడు అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.3,200, హెల్పర్లకు ఇంకా తక్కువ వేతనం ఉండగా, రాష్ట్రం వచ్చిన వెంటనే వీరికి వేతనాలు పెంచింది. టీచర్లకు నెలకు రూ.13,650, హెల్పర్లకు రూ.7,800 వేతనం అందించింది. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంతగా వేతనాలు పెంచలేదు. ఆ తర్వాత ప్రభుత్వోద్యోగులకు ఇస్తున్నట్టుగా రెండు సార్లు పీఆర్‌సీ అమలు చేసింది. అయితే కరోనా విపత్కర కాలంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నా.. సంక్షేమాన్ని మాత్రం ఆపలేదు. ఉద్యోగులకు అటో ఇటో వేతనాలు కాస్త ఆలసమయ్యాయి కానీ, ఏ నెల కూడా వేతనాలు ఆపలేదు.

నేడు జీతాల కోసం ఎదురుచూపు

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలిచ్చింది. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని, ప్రభుత్వోద్యోగులతో కలిపి ఏ నెలకు ఆ నెల విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చింది. ఇంకా ఒకటో తారీఖే వేస్తామని చెప్పింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 75రోజులు గడిచింది. కానీ, ఇప్పటికీ వరకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు జీతాలు విడుదల చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 35వేల సెంటర్లలో పనిచేస్తున్న దాదాపు 65వేల అంగన్‌వాడీలు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. జీతాలు పెంచడమేమో గానీ, ఉన్న జీతాలు కూడా సక్రమంగా పంపిణీ చేయడం లేదని మండిపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఏరు దాటినంక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తున్నదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ప్రస్తుతం తమ పరిస్థితి పెనం పై నుంచి పొయ్యిలో పడ్డట్టుగా మారిందని కన్నీటి పర్యంతమ వుతున్నారు. జీతాలు లేక తమ కుటుంబాల పరిస్థితి కడుదయనీయంగా మారతున్నదని, అప్పులు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎదుర్కొంటున్న పరిస్థితులపై కాంగ్రెస్ పార్టీ నాయకుల ఎదుట అయినా గోడు వెళ్లబోసుకుందామంటే, కనీసం వారిని కలిసే సమయం కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమకు సత్వరమే జీతాలు విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆడుకుంటున్న చిన్నారులు (ఫైల్)

భూలక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కల్యాణ వైభోగమే..

- వైభవంగా భూలక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బండ్ల దంపతులు

గద్వాల/గద్వాలటౌన్, ఫిబ్రవరి 22 : భూదేవి.. శ్రీదేవీతో కలిసి కల్యాణవేదికపై చెన్నకేశవుడు పెండ్లికొడుకై కొలువు దీరగా.. వేద పండితుల మంత్రోచ్చారణలు.. మేళతాళాల మధ్య ఇరువురు భామల మెడలో చెన్నకేశవస్వామి మాంగళ్యధారణ చేయగా.. భక్తజనం పులకించిపోయారు.. దీంతో గద్వాల కోట మొత్తం గోవింద నామస్మరణతో మార్మోగింది. జిల్లా కేంద్రంలోని గద్వాల కోటలో కొలువు దీరిన భూలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బండ్ల జ్యోతి దంపతులు హాజరై స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అర్చకులు వెంకటేశాచారి, రాఘవేంద్రచారి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించగా వేలాది మంది భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తన్మయత్వం పొందారు. అనంతరం స్వామి, అమ్మవారిని మయూరి వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా విజితాగౌడ్ కళా బృందం ఆలపించిన అన్నమయ్య, వేంకటేశ్వరస్వామి సంకీర్తనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నాయకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే బండ్ల దంపతులు

రెండోరోజూ న్యాక్‌బృందం పర్యటన

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి 22 : జడ్చర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండోరోజూ న్యాక్‌బృందం పర్యటించింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పీయ చిన్నమ్మ ఆధ్వర్యంలో న్యాక్‌బృందం చైర్మన్ డాక్టర్ తారానాథ్, సభ్యులు ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, డాక్టర్ బిమల్ బరాహ్ గురువారం కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటి నీళ్లుపోశారు. బొటానికల్ గార్డెన్‌లోని వివిధ విభాగాలకు సంబంధించిన వివరాలను గార్డెన్ సమన్వయకర్త డాక్టర్ సదాశివయ్య న్యాక్ బృందానికి వివరించారు. గార్డెన్‌లోని గ్రీన్‌నెట్‌హౌస్, అరుదైన మొక్కలతోపాటు అంతరించిపోతున్న మొక్కలను పరిశీలించారు. బయోడైవర్సిటీ రీసెర్చ్ సెంటర్, పాముల సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. కళాశాలలో అన్ని విధాలా సదుపాయాలున్నాయని, ఇంకా అభివృద్ధి సాధించటానికి పలు సూచనలు చేశారు. అలాగే కళాశాల స్వయం ప్రతిపత్తికి దరఖాస్తు చేసుకోవాలని న్యాక్ బృందం సభ్యులు సూచించారు.

విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలి

- అసత్య ప్రచారాలను ఒకేసారి నమ్ముతారు
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 2 : ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించినప్పుడే తాము అనుకున్న గమ్యాన్ని చేరుకుంటారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని విష్ణు కన్వెన్షన్ హాల్‌లో వ్యక్తిత్వ వికాస సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువుకొనే సమయంలో సెల్‌ఫోన్, సినిమాలు, టీవీలకు దూరంగా ఉండాలని సూచించారు. పిల్లలు తమ చదువును నిర్లక్ష్యం చేస్తూ సామాజిక మాధ్యమాలవైపు ఆకర్షితులవుతున్నారని అలాంటి విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. తమ పిల్లలను ఇతర విద్యార్థులతో పోల్చి వారిని నిరుత్సాహ పర్చవద్దని, వారిలోని ఆసక్తిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఉన్నత చదువు చదివి సమాజానికి సేవచేయాలనే ఆలోచన ప్రతిఒక్కరిలో రావాలన్నారు. గొప్ప చదువులు చదివించి ఉద్యోగం వచ్చాక.. తమ తల్లిదండ్రులను అనాథ ఆశ్రమాలకు పంపుతున్నారని, అలాంటి పనులు ఎవరూ చేయవద్దని ఆయన వారికి సూచించారు. మహబూబ్‌నగర్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామని, ప్రతిపక్షంలో ఉన్నా జిల్లా అభివృద్ధి గురించే ఆలోచిస్తాంటామని తెలిపారు. అబద్ధాలు, అసత్య ప్రచారాలను ప్రజలు ఒకేసారి నమ్ముతారని.. నిజం తెలుసుకొని మళ్లీ మావెంటే ఉంటారన్న నమ్మకం మాకుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని అభినందిస్తున్న నిర్వాహకులు

ఆత్మహత్యక లకలం!

- వేధింపులు తాళలేక వృద్ధుడి ఆత్మహత్య?
- సూసైడ్ నోట్‌తో పలు అనుమానాలు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వృద్ధుడి ఆత్మహత్య కలకలం రేపింది. వేధింపులు తాళలేక వృద్ధుడు గురువారం ఉదయం 6 గంటలకు ఆత్మహత్య చేసుకున్న ఘటన వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. కొండారెడ్డిపల్లికి చెందిన ఎనుముల గురువారెడ్డి (74)భార్య పదేండ్ల కిందట అనారోగ్యంతో చనిపోయింది. ఇతడి పెద్ద కొడుకు సుధీశ్‌రెడ్డి హైదరాబాద్‌లో, చిన్న కొడుకు సురేశ్‌రెడ్డి అమెరికాలో నివసిస్తున్నారు. సీఎం రేవంత్‌కు గురువారెడ్డి పాలోళ్లు.. అయితే అదే గ్రామానికి చెందిన పార్వతమ్మకు డబ్బు అవసరం ఉండగా.. భూమిని కుదవపెట్టి డబ్బు ఇప్పించాలని గురువారెడ్డిని కోరింది. అతడు కల్వకుర్తికి చెందిన మత్రునాయక్, పాండుగౌడ్‌ను సంప్రదించాడు. భూమి వారి పేర చేస్తే డబ్బులిస్తామని చెప్పడంతో పార్వతమ్మకు చెందిన రెండెకరాల భూమి వారి పేరుపై రిజిస్ట్రేషన్ చేసి రూ.2 లక్షలు అందజేశారు. కాగా పార్వతమ్మకు తెలియకుండా గురువారెడ్డి సదరు వ్యక్తుల నుంచి రూ.8 లక్షలు తీసుకున్నాడు. కొద్ది రోజుల తర్వాత పార్వతమ్మ డబ్బు సమకూరడంతో పొలాన్ని తిరిగి రిజిస్ట్రేషన్ చేయాలని సదరు వ్యక్తులను కోరింది. నీ అప్పే రూ.10 లక్షలు ఉందని చెప్పడంతో అవాక్కైంది. ఈ విషయమై గురువారెడ్డిని నిలదీయగా.. తాను డబ్బు తెచ్చుకున్నట్లు.. డబ్బు సమకూర్చి నీ భూమికి వచ్చేలా చూస్తానన్నాడు. తర్వాత ఆ ఊసే ఎత్తకపోవడంతో పార్వతమ్మ ఒత్తిడి తేగా అరెకరం భూమిని తీసుకొని పార్వతమ్మకు భూమిని ఇవ్వాలని వారిని కోరాడు. అయితే ఈ పొలం ఫీల్డ్(మోఖా)లో లేకపోవడంతో వారు మొత్తం డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బుధవారం సాయంత్రం కొందరు గురువారెడ్డిని వంగూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎస్సై లేకపోవడంతో మరుసటి రోజు రావాలని సూచించారు. దీంతో గురువారెడ్డిని గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో పెట్టి తాళం వేశారు. ఈ అవమానాన్ని తట్టుకోలేక గురువారం తెల్లవారుజామున ఉరేసుకొని చనిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి అతడి వద్ద ఉన్న సూసైడ్ నోట్ సేకరించారు. మత్రునాయక్, పాండుగౌడ్ మానసిక క్షోభకు గురిచేశారని, వారి వేధింపుల వల్లనే తాను చనిపోతున్నానని గురువారెడ్డి సూసైడ్ లెటర్‌లో పేర్కొన్నాడని ఎస్సై మహేందర్ చెప్పారు. ఈ నోట్ బహిర్గతం చేయకపోవడంతో పలువురు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో ట్విస్ట్ ఏమిటంటే.. పార్వతమ్మ సీఎం రేవంత్‌రెడ్డికి వరుసకు అత్తవుతుంది. కాగా ఈ ఘటన గురించి గ్రామంలో ఎవరికి అడిగినా పూర్తి వివరాలు తెలియవని.. పెద్దోళ్లతో గొడవ మనకెందుకులే అని చెబుతున్నారు. ఆయన్ను పోలీస్ స్టేషన్‌కు ఎవరు తీసుకెళ్లారు.. గుడిలో ఎవరు బంధించారు.. అనే విషయాన్ని ఎవరూ చెప్పలేకపోతున్నారు.